ప్రజాశక్తి
శుక్రవారం 8 మార్చి 2024
5
పార్వతీపురం మన్యం

జెసిగా బాధ్యతలు చేపట్టిన శోభిక

బాధ్యతలు స్వీకరిస్తున్న జెసి శోభిక

పార్వతీపురంరూరల్ : నూతన జాయింట్ కలెక్టర్‌గా ఎస్‌ఎస్ శోభిక గురువారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసిన జాయింట్ కలెక్టర్‌కు డిఆర్‌ఒ జి.కేశవనాయుడు, ఆర్‌డిఒలు కె.హేమలత, ఎ.వెంకట రమణ, కలెక్టరేట్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. జెసిగా బాధ్యతలు చేపట్టిన శోబిక ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు, జిల్లాలో కొనసాగుతున్న కార్యక్రమాలు కొనసాగించేందుకు కృషి చేస్తామని తెలిపారు. జెసిగా బాధ్యతలు చేప ట్టిన శోభికకు పలువురు అభినదనలు తెలిపారు.

పోరులో అధినేత్రిగా.. ఊరిలో అధికారిగా..

పోరులో అధినేత్రిగా... ఊరిలో అధికారిగా అంటూ మహిళల బహుముఖ పాత్రను వివరించాడో రచయిత. 'ఎక్కడమ్మా.. నీవు లేనిది?, ఏమిటీ నీవు చేయలేనిది?' అని కీర్తించాడో మరో కవి. ఇలా సమాజంలో సగభాగమై ముందుకు నడుస్తున్న మహిళలు ఓవైపు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూనే మరెంతో ముందుకు దూసుకుపోతున్నారు. డాక్టర్ నుంచి యాక్టర్ వరకు, కండక్టర్ నుంచి కలెక్టర్ వరకు, హోంగార్డు నుంచి మేజర్ వరకు మహిళలు రాణిస్తున్నారు. మరోవైపు మహిళలు రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నా అవి అమలు కావడం లేదు. నిత్యం ఏదో ఒకచోట మహిళలు అణచివేత, వేధింపులు, ప్రేమపేరిట దాడులు ఎదుర్కొంటూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో మహిళల వీరోచిత పోరాటాలు గుర్తుచేసుకుని, ఉన్నతమైన సమాజం వైపు ఆలోచింపజేసుకుంటూ ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారు.

- అన్నింటా రాణిస్తున్న మహిళలు
- కండక్టర్ నుంచి కలెక్టర్ వరకు
- యాక్టర్ నుంచి డాక్టర్ వరకు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం అంటే క్రీడా, కళా, సాంస్కృతిక రాజధాని. రాజకీయ, సామాజిక, ఆర్థిక తదితర రంగాల్లో ఎంతో మంది మహిళలు తమ సత్తా చాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పేరు తెచ్చుకుంటున్నారు. జిల్లా మనుగడలో వ్యవసాయ రంగానిదే కీలకపాత్ర. వీటన్నింటిలోనూ మహిళలదే ముఖ్యభూమిక. జిల్లా కలెక్టర్, ఎస్‌పి సహా ఎన్నో శాఖల్లో ఉద్యోగులు కూడా మహిళలే ఎక్కువగా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఈ మాటకొస్తే మన జిల్లా డిఆర్‌ఒ, ఆర్‌డిఒ, ఎఎస్‌పి మొదలుకుని ఎంతో మంది మహిళా అధికారులు ఉన్నారు. అటు విజయనగరం కార్పొరేషన్ మేయర్ మొదలు సర్పంచులు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యుల్లో సగం మంది మహిళలే. ఓవైపు ఇంటిని చక్కబెడుతూనే ఎన్నికల్లో తాము సైతం అంటూ ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోబడుతున్నారు. అధికారులుగా ప్రభుత్వం తరపున సేవలందిస్తున్నారు.

విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో ప్రతి ఇంటిలోనూ శ్రామిక మహిళలు ఉన్నారు. క్వారీలు మొదలుకుని, వ్యవసాయం, నిర్మాణ రంగం తదితర రంగాల్లో కష్టపడి ఇంటిని నెట్టుకొస్తున్న మహిళలు అనేకం. చివరికి బండరాళ్లు మోసేవారిలోనూ మహిళలు భాగస్వామ్యమౌతున్నారు. ఇలా జీవన పోరాటంలోనూ, సమాజాభివృద్ధిలోనూ భాగస్వామ్యమౌతూనే తిరిగి ఇంటికి వెళ్లాక భార్యగా, అమ్మగా ఇల్లు చక్కబెడుతున్నారు. పురుషులతో సమానంగా పోటీ పడుతూ, కష్టపడుతున్నప్పటికీ పలు సందర్భాల్లో మహిళలు అన్నింటా అణచివేతకు, వివక్షతకు గురవుతున్నారు. నవమాసాలూ మోసి, పిల్లల్ని కని, తల్లిగా లాలిస్తూ పెద్ద చేస్తుంది. సోదరిగా ప్రేమానురాగాలను పంచుతుంది. భార్యగా జీవితంలో సగభాగమై ముందుకు సాగుతోంది.. ఉద్యోగిగా సమాజానికి తన వంతు సేవలందిస్తోంది. ఈ క్రమంలో ఎన్నో ఆటుపోట్లు, ఒడిదొడుకులు ఎదురైనా పుట్టెడు సహనంతో ముందుకు సాగుతోంది.. తెరవెనుక మహిళల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పని ప్రదేశాల్లో, కార్యాలయాల్లో, ప్రయాణ సమయాల్లో వేధింపులు, వెక్కిరింపులు, ఇళ్లల్లో అణచివేత ఇలా ఎన్నో కష్టాలు

ఇటుక బట్టీలో పనిచేస్తున్న శ్రామిక మహిళ

ఎదురించి మరీ చెమట చుక్కలు చిందిస్తున్నారు.

సృష్టికే మూలంగా ఉన్న మహిళ ఓవైపు అన్ని రంగాల్లో రాణిస్తుండగా, మరోవైపు అడుగడుగునా అణచివేతకు గురవుతోంది. పని ప్రదేశాల్లో మహిళలు ఆర్థిక, లైంగిక దోపిడీకి గురవుతున్నారు. మరుగుదొడ్లు సైతం లేక ఆత్మగౌరవాన్ని చంపుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇంకా చెప్పాలంటే ప్రత్యేకించి మన రెండు జిల్లాల్లో మహిళలు పేరుకు ప్రజాప్రతినిధులుగా ఉన్నా, వారి అధికారాన్ని కుటుంబంలోని పురుషులే చెలాయిస్తున్నారు. వేధింపులు, అణచివేత నేపథ్యంలో ఆడపిల్లలంటే ఎంతోమంది భారంగా భావిస్తున్నారు. బహుశా అందుకేనేమో కొన్నేళ్లుగా జిల్లా జనాభాలో మహిళల సంఖ్య తగ్గుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ అంతరాలు పోవాలంటే రాజ్యాంగం కల్పించిన హక్కులను పాలకులు నిష్పక్షపాతంగా అమలు చేయాలి. ఈ పరిస్థితుల్లో ఆకాశంలో సగంగా ఉన్న మహిళ సగర్వంగా తలెత్తుకు తిరగాలని, భవిష్యత్తు మరింత దేదీప్యమానం కావాలని, అందుకు రాజ్యాంగ యంత్రాంగం సహకరించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

పోరాట చిహ్నమే మహిళా దినోత్సవం

కుట్టుపని చేసే శ్రామిక మహిళలు నిర్వహించిన వీరోచిత పోరాట సంప్రదాయాన్ని నిలబెట్టేందుకు ఏటా మార్చి ఎనిమిదో తేదిని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. తొలుత శ్రామిక మహిళలు ఈ కార్యక్రమానికి నాంది పలికితే, ఆ తర్వాత మహిళా కమ్యూనిస్టులు నాయకత్వం వహించి మరింత ముందుకెళ్లారు. అణచివేత, వివక్షతను వ్యతిరేకిస్తూనే స్వేచ్ఛ, సమానత్వం కోసం నేటికీ మహిళలు పోరాడుతూనే ఉన్నారు. జాతి, మత, కుల, ఆర్థిక, సామాజిక వ్యత్యాసాల్ని పక్కనబెట్టి ఒకే వేదికపైకి చేరాల్సిన రోజు ఇది.

షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దె గోల్ మాల్

అధికారులకు తెలియకుండా షాపు వినియోగం

దీని వెనుక ఎవరున్నారో తేలాలి : వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

ప్రజాశక్తి -సాలూరు

స్థానిక మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక షాపు అద్దె గోల్‌మాల్ జరుగుతున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ షాపునకు సంబంధించిన అద్దె డబ్బులు మున్సిపల్ ఖాతాలో జమ కావడం లేదు. 2017 నుంచి పట్టణానికి చెందిన ఓ ఛార్టర్డ్ అకౌంటెంట్ అధీనంలో ఈ షాపు ఉంది. ఆయన మాత్రం అద్దెను మున్సిపల్ అధికారులకు చెల్లించడం లేదని గురువారం వెలుగులోకి వచ్చింది. తీగలాగితే డొంక కదిలినట్లు ఈ షాపు అద్దె బాగోతం ఆలస్యంగా బయటపడింది. గత నెలలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అజెండాలో 20వ నెంబరు షాపు ఖాళీగా వుందని అధికారులు చూపించారు.దీనిపై అనుమానం వచ్చిన వైసిపి కౌన్సిలర్లు గిరిరఘు, గొర్లి వెంకటరమణ, బి.శ్రీనివాసరావు, రాపాక మాధవరావు వైస్‌చైర్ పర్సన్ జర్జాపు దీప్తితో కలిసి గురువారం షాపింగ్ కాంప్లెక్స్‌లోని 20 నెంబర్ షాపును పరిశీలించారు. పట్టణానికి చెందిన ఛార్టర్డ్ అకౌంటెంట్ పేరిట షాపు వున్నట్లు దానిపై వున్న బోర్డులో ఉంది. మున్సిపల్ ఆర్వో రాఘవాచార్యులు, ఆర్‌ఐ శ్రీనివాసరావుతో కలిసి వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు షాపు వద్దకు వెళ్లి ఆరా తీశారు. ఆ షాపు బోర్డులో ఉన్న యజమానికి అధికారులు ఫోన్ చేసి వివరాలు అడిగారు. 2017 నుంచి తన అధీనంలో ఆ షాపు ఉందని యజమాని అయిన ఛార్టర్డ్ అకౌంటెంట్ అధికారులకు చెప్పడంతో వారు ఖంగుతిన్నారు. షాపు అద్దె ఎవరికి చెల్లిస్తున్నారని ఛార్టర్డ్ అకౌంటెంట్‌ను ప్రశ్నించగా చెల్లించలేదని ఆయన సమాధానం చెప్పారు. షాపు అద్దె వెంటనే చెల్లించాలని లేకపోతే పోలీసు కేసు పెడతామని అధికారులు హెచ్చరించారు. మున్సిపల్ అధికారులు ఆ షాపు కి ఇంకో తాళం వేసి నిష్క్రమించారు.

అద్దె చెల్లించని షాపు

నిద్రావస్థలో రెవెన్యూ అధికారులు

మున్సిపల్ రెవెన్యూ అధికారులు నిద్రావస్థలో ఉన్నారనడానికి ఈ వ్యవహారం చక్కని ఉదాహరణగా చెప్పొచ్చు. ఎందుకంటే 2017 నుంచి షాపు అద్దె జమ చేయకుండా యజమాని తన అధీనంలో ఉంచుకున్నారంటే రెవెన్యూ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నది స్పష్టమవుతోంది. టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి పాలకవర్గం బాధ్యులు షాపును అనధికారికంగా ఆ ఛార్టర్డ్ అకౌంటెంట్‌కు ఇచ్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2020లో వైసిపి పాలకవర్గం పగ్గాలు చేపట్టింది. అప్పుడు కూడా రెవెన్యూ అధికారులు దీన్ని కనిపెట్టకుండా దాచిపెట్టి వుంచారు. ఇప్పటివరకు అధికారులకు తెలిసినా ఈ బాగోతం బయటపెట్టకుండా కౌన్సిల్‌ను తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుత పాలకవర్గంలో కీలక ప్రజాప్రతినిధి గుట్టుచప్పుడు కాకుండా ఆ షాపు అద్దె డబ్బును తన ఖాతాలో వేసుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

దీని వెనుక ఎవరున్నారో తేలాలి: వైస్ చైర్ పర్సన్ దీప్తి, కౌన్సిలర్లు

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక షాపు అద్దెను దారి మళ్లిస్తూ ఖాళీగా ఉందని చూపుతున్న వ్యవహారం వెనుక ఎవరున్నారో తేలాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించాలి.

షాపు వద్ద విచారణ చేస్తున్న వైస్‌చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

ప్రాధాన్యతా భవనాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

గృహ నిర్మాణాలు, ప్రాధాన్యతా భవనాలను వెంటనే పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్ రెడ్డి తెలిపారు. గురువారం జిల్లాకలెక్టర్లు, పోలీసు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రహదారి భద్రత, గృహనిర్మాణం, రీ-సర్వే, గృహనిర్మాణం, కారుణ్య నియామకాలు, ఉపాధికల్పన జగనన్న ఆరోగ్య సురక్ష, పల్స్ పోలియో కార్యక్రమం, పంచాయతీరాజ్ పనులు తదితర పథకాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం స్థానిక ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ జిల్లా ప్రగతిని వివరిస్తూ రీసర్వే, ప్రాధాన్యతా భవనాలు నిర్మాణం, గృహనిర్మాణ పనులను లక్ష్యంమేరకు త్వరలోనే పూర్తిచేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎస్.ఎస్.శోబిక, జిల్లా రెవిన్యూ అధికారి జి.కేశవనాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు, డ్వామా పి.డి. రామచంద్రరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేషనల్ యూత్ వాలంటీర్ల ఎంపిక

ప్రజాశక్తి - పార్వతీపురం

నేషనల్ యూత్ వాలంటీర్లు ఎంపిక గురువారం పూర్తయిందని జిల్లా యువజన అధికారి కె.వెంకటఉజ్వల్ తెలిపారు. గత ఏడాది మార్చిలో నేషనల్ యూత్ వాలంటీర్లకు దరఖాస్తులు ఆహ్వానించారు. నెహ్రూ యువ సంఘటన్ ఆదేశాల మేరకు ఎంపిక కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. 360 మంది దరఖాస్తు చేశారని, గురువారం మౌఖిక పరీక్షలు నిర్వహించి ముగ్గుర్ని ఎంపిక చేశామని, ఆరుగురిని వెయిటింగ్ లిస్టులో పెట్టడం జరిగిందని ఆయన చెప్పారు. ఈ ఎంపికలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్, సామాజిక సేవా కార్యకర్తలు కె.తిరుపతి రావు, కె.పద్మనాభం పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ఎఎన్ఎం పోస్టుల భర్తీకి చర్యలు • ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి

ప్రజాశక్తి - సీతంపేట

విద్యార్థుల ఆరోగ్యంపై అధికారులు, హాస్టల్ వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు దృష్టిసారించాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు సూచించారు. మండలంలోని గురువారం పలు పాఠశాలలను పరిశీలించారు. తొలుత హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలకు వెళ్లి వసతి గృహాన్ని పరిశీలించారు. అనంతరం సీతంపేట ఏరియా ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రిలోని అన్ని బ్లాకులను పరిశీలించారు. వార్డుల్లో రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మందులు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఐటిడిఎలోని సెక్టోరియల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఎఎన్ఎంల భర్తీకి చర్యలు తీసుకొంటామన్నారు. అన్ని పాఠశాలలకు వైద్య సిబ్బంది తరుచుగా వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సికిల్‌సెల్ పరీక్షలు అందరికీ చేయాలన్నారు. వసతి గృహాల్లో నాలుగో తరగతి ఉద్యోగులను నియమించేలా చర్యలు తీసుకొంటామన్నారు. విడివికెలను అభివృద్ధి చేయాలన్నారు. గిరిజన గ్రామాల్లో జరుగుతున్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన వారందరికీ అటవీ పట్టాలివ్వాలని సూచించారు. వారికి రైతు భరోసా పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి ముందు గిరిజన సంఘాలు, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అంతకుముందు మెలియాపుట్టిలో పర్యటించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వి.కళావతి, ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి, ఎపిఒ రోసిరెడ్డి, డిడి అన్నదొర, ఏరియా ఆసుపత్రి సూపరింటెడెంట్ శ్రీనివాసరావు, డి.కృష్ణకుమార్, జిసిసి డిఎం సంధ్యారాణి, పిహెచ్ఒ గణేష్, పిఎఒ హరికృష్ణ, ఐటిడిఎలోని అన్ని శాఖల అధికారులు, గిరిజన జెఎసి రాష్ట్ర నాయకులు బిడ్డిక తేజేశ్వరరావు, గిరిజన సంఘ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు

జిఒ 3ను పునరుద్ధరించాలని చైర్మన్‌కు యుటిఎఫ్ వినతి

జిఒ నెంబరు 3ను పునరుద్ధరించాలని కోరుతూ యుటిఎఫ్ నాయకులు చైర్మన్‌కు వినతిని అందజేశారు. అలాగే ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ పోస్ట్ ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని, సవర భాష వాలంటీర్లను మార్చి, ఏప్రిల్‌లో కొనసాగించాలని, డిఎస్‌సిలో సిఆర్‌టిలను పోస్టులు కలపరాదని కోరారు. వినతిని అందజేసిన వారిలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, గౌరవాధ్యక్షులు ఎ.భాస్కరరావు తదితరులు ఉన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి ఏడేళ్లు జైలు

ప్రజాశక్తి -సాలూరు

మండలంలోని మామిడిపల్లికు చెందిన ఓ మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన కేసులో పి.రమణయ్య(50)కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ ఉమ్మడి జిల్లా మహిళా కోర్టు జడ్జి నాగమణి గురువారం తీర్పు చెప్పారు. బాధిత బాలికకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చేయాలని జడ్జి నాగమణి తీర్పులో పేర్కొన్నారు. 2021 జనవరి 12న ఎనిమిది ఏళ్ల బాలికపై వికృతంగా అఘాయిత్యానికి రమణయ్య పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో ఈ తీర్పు వెలువడింది. మామిడిపల్లిలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న బాలిక తల్లిదండ్రులు ఉపాధి కోసం గుంటూరు వెళ్లారు. బంధువుల ఇంటి వద్ద ఉంటున్న బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన రమణయ్యపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు కావడంతో పోలీసు అధికారులు తగిన ఆధారాలు చూపించి శిక్ష పడేలా చేశారు. ఈ కేసు విచారణలో సహకరించిన అధికారులు, పోలీసులను ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.

లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఇన్‌ఛార్జి జెసి విష్ణుచరణ్

నాలుగో విడత 'చేయూత' నిధులు జమ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడత నిధులు విడుదల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో లబ్ధిదారులకు రూ.136.60 కోట్లు నమూనా చెక్కును ఇన్‌ఛార్జి జాయింటు కలెక్టరు సి. విష్ణుచరణ్ లబ్ధిదారులకు గురువారం అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేయూత నిధులను మీటనొక్కి నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. జాయింటు కలెక్టరు సి.విష్ణుచరణ్, లబ్ధిదారులు కలెక్టరు కార్యాలయ సమావేశమందిరం నుండి వర్చువల్ గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలో 72,854 మంది లబ్దిపొందిన మహిళలకు ఒక్కొక్కరి ఖాతాలో రూ.18,750 చొప్పున రూ.136,60,12,500 నిధులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. అనంతరం ఇన్‌ఛార్జి జెసి మాట్లాడుతూ మహిళా లబ్ధిదారులకు కుటుంబ స్థాయిలో మెరుగైన జీవనోపాధులను అంది పుచ్చుకునేలా అవకాశాలను కల్పించడం, సంపద సృష్టి ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా సుస్థిరమైన జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం అందించిన ఈ సాయంతో మహిళలు పశువుల పెంపకం, పాల సేకరణ, ఆరోగ్య సేవలు, కిరాణా షాపులు, బట్టల షాపులు, పండ్లు, కూరగాయలు, చిన్న జీవాలు కొనుగోలు, చిన్న మధ్య తరహా వ్యాపారాలు నడుపుకోవడానికి లేదా జీవనోపాధి కార్యక్రమాలకు వినియోగించుకోని ఉపాధి పొందినట్లు కార్యక్రమానికి హాజరైన మహిళలు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు అధికారి వై. సత్యంనాయుడు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో మాతా శిశు మరణాల నివారణ

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జగన్నాథరావు

ప్రజాశక్తి -పార్వతీపురం

సమిష్టి కృషితో మాతృ, శిశు మరణాలు నివారణ చేయవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రిజమ్10 పై నిర్వహించిన మండల మహిళ సమాఖ్య సమన్వయ సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. శిశు మరణాలు రేటు, రక్తహీనత నివారణ లక్ష్యంగా ప్రిజమ్10 ప్రాజెక్ట్ ద్వారా జిల్లా వ్యాప్తంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో ప్రవేశ పెట్టిన ప్రిజమ్10 ప్రాజెక్ట్ కార్యాచరణ పలు శాఖల సమన్వయంతో, సమిష్టి కృషితో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి సచివాలయాల పరిధిలో రక్తహీనత ఉన్న గర్భిణీ, బాలింతలు, కిశోర బాలికల వివరాలు, పౌష్టికాహార లోపం గల పిల్లల వివరాలు ఇచ్చామని, వీరిని నిత్యం పర్యవేక్షించేందుకు వైద్య, సచివాలయ, స్వయం సహాయక సంఘాలు, శిశు సంక్షేమ శాఖ, వెలుగు, మహిళా సమాఖ్య శాఖల నుండి నియమించిన అడాప్షన్ అధికారులు ఉంటారని తెలిపారు. వీరు వారికి నిర్దేశించిన గర్భిణీ, బాలింతలు, శిశు ఆరోగ్యం ఏ మేరకు వృద్ధి చెందుతుంది, వారికివ్వబడిన మందుల వినియోగం పరిశీలిస్తూ వివరాలు నమోదు చేస్తారన్నారు .ప్రజల్లో వీటి ప్రాముఖ్యతను వివరిస్తూ, అవగాహన కల్పించి అందరి సమిష్టి కృషితో మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు. సమావేశంలో వెలుగు ఎపిడి వై సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భామిని : జిల్లాలో మాతా, శిశు మరణాలను అరికట్టేందుకు కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రవేశపెట్టిన ప్రిజమ్ 10 లక్ష్యాలను వైద్య సిబ్బంది సాధించాలని స్థానిక వైద్యాధికారి సంతోష లక్ష్మి తెలిపారు. గురువారం భామిని, లివిరి గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో ప్రిజం 10 నిర్వహణపై సమీక్షించారు. ప్రతి పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది 8.5 తక్కువ గర్భిణులను గుర్తిస్తే, వారిని వైద్య, సచివాలయం సిబ్బంది దత్తత తీసుకుని అంగన్వాడీ నుండి పూర్తి స్థాయిలో పోషకాలు అందించి వినియోగించేలా చూడాలని అన్నారు. అలాగే పూర్తి స్థాయి వైద్యమందేలా చేసి, గర్భిణీకి పూర్తి స్థాయిలో హెచ్‌బి శాతం పెంచేలా చేసి, కార్యక్రమం లక్ష్యలూ సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.కృష్ణారావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి అప్పారావు, సిహెచ్ఒ భాస్కరావు, హెచ్ వి గౌరీశ్వరి ఉన్నారు.

చెక్‌పోస్టు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ఎఒబి చెక్ పోస్టు తనిఖీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని ఆంధ్రా - ఒడిశా సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన అడారు చెక్ పోస్ట్‌ను గురువారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఒడిశా నుంచి నాటుసారా, గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి అన్ని రకాల వాహనాలను తనిఖీ చేయాలని చెప్పారు. చెక్ పోస్ట్ సిబ్బంది అప్రమత్తంగా వుండి అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అనుమానం ఉన్నా, ముందస్తు సమాచారం వున్నా తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.

నిబంధనలకు లోబడి వార్తలు ఉండాలి

పార్వతీపురం రూరల్ : త్వరలో జరగబోవు శాసనసభ, పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే నాటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తుందని, దీనికి లోబడే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ సోషల్ మీడియా వార్తలు ఉండాలని ఆర్‌డిఒ కె.హేమలత అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై పాత్రికేయులకు ఒకరోజు వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వార్తలు ఏ విధంగా రాయాలి, రాయాల్సిన వార్తలు, ప్రచురించే ముందు ఎలాంటి అనుమతులు తీసుకోవాలనే విషయాలను సోదాహరణంగా వివరించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పేదలకు ఇళ్ల పట్టాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సొంత ఇల్లు లేని పేదవారు ఉండకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టా పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టిందన్నారు. అర్హత ప్రమాణికంగా, కుల, మత రాజకీయాలకు అతీతంగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బంగారమ్మ, వైస్ ఎంపిపి బంకురు రవికుమార్, సిద్ధ జగన్నాథరావు, నాయకులు గురురాజు, బొమ్మి రమేష్, బలగ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రక్తహీనతపై గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న నీడ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

రక్తహీనత పై అవగాహన

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన గర్భిణులు రక్తహీనతపై అవగాహన పెంచుకోవాలని నీడ్ స్వచ్ఛంద సంస్థ సి సి రత్నం కోరారు. మండలంలోని నందలో గురువారం సర్పంచ్ రమేష్ సమక్షంలో గ్రామానికి చెందిన గర్భిణులకు అవగాహన కల్పించారు. రక్తహీనత కారణంగా పుట్టబోయే బిడ్డ, తల్లి తీవ్ర అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. అలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. నీడ్ పిసి మోహన్ మాట్లాడుతూ గిరిజన గర్భిణులకు సాలూరు వైటిసిలో వసతి, భోజన సౌకర్యాలతో పాటు వైద్య సేవలందజేస్తున్నట్లు చెప్పారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో గర్భిణులకు సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో విఆర్వో, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

మన్యం జిల్లా బంద్‌కు ఎఐఎస్ఎఫ్ మద్దతు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్పెషల్ డీఎస్సీ కోసం మార్చి 10న జరగనున్న మన్యం బంద్‌కు ఎఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ అన్నారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు 100శాతం ఇవ్వాలని, జీవో 3 చట్టబద్ధతకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలని, ఎంతోమంది పేద విద్యార్థులు నిరుద్యోగంతో కొట్టిమిట్టాడుతున్నారని అన్నారు. మెగా డిఎస్‌సి విడుదల చేయాలని, దగా డిఎస్‌సి వద్దు... ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి కావాలని, అలాగే నాన్ షెడ్యూల్ 1500 ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్పించాలని కోరారు.

కురుపాంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఎన్నికల భద్రతకే కవాతు

ప్రజాశక్తి - కురుపాం

రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ కోరారు. గురువారం సాయంత్రం సాయిరాం గుడి గ్రౌండ్ నుండి పెట్రోలు బంకు వరకు పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సీఆర్పీఎఫ్, సెంట్రల్ పారా మిలటరీ బలగాలతో పోలీసుశాఖ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించడం జరిగిందని ఆ సమయంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా పరంగా పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించేందుకే ఈ కవాతు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఆర్పీఎఫ్ సిఐ ఐఎస్ఎన్ రాజు, స్థానిక ఎస్సై షణ్ముఖరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలి, చినబోగిలి అంగన్వాడీ కేంద్రాలను ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి పిఎల్ రవి కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఉండే పిల్లల రక్తహీనత కలిగిన వారిని, అలాగే పౌష్టికాహార లోపం ఉన్నవారిని లేకుండా చూడాలన్నారు. ప్రాథమిక పాఠశాలలలో విద్యార్థులకు ఐరన్ మాత్రలు ప్రతి గురువారం వేయించాలన్నారు. హెమోగ్లోబిన్ టెస్టులు ఎప్పటికప్పుడు చేసి లోపాలను గుర్తించి వెంటనే వాటిని సరి చేసుకోవాలన్నారు. అనంతరం సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో ఉండే గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారి లోపాన్ని సరిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పావని సిఒఎస్ వి.రమణ, హెచ్ఎస్ శర్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రవికుమార్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మొక్కలు నాటండి పర్యావరణాన్ని రక్షించండి అంటూ శ్రీ సాయిరాం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గత వారం రోజులుగా అడ్డాపుశీలలో నిర్వహించిన సేవా కార్యక్రమాలు ముగింపు సందర్భంగా గురువారం గ్రామంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత బహిరంగ మలవిసర్జన వల్ల కలిగే అనర్థాలు గురించి గ్రామస్తులకు నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాములు పోలమ్మ, కాలేజీ ప్రతినిధి పెంట అప్పారావు, ప్రిన్సిపల్ జి.శ్రీధర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారులు డి.దేవి, తిరుపతిరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. మండలంలోని కిండంగిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామసచివాలయ భవనం, రూ.17.5 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల స్థాయిలో ఉండే ప్రభుత్వ శాఖల సిబ్బంది అంతా గ్రామస్థాయిలో ఉండి, ప్రభుత్వ పరిపాలన క్షేత్రస్థాయికి తీసుకొచ్చి, సేవలను ప్రజల గడప వద్దకే అందించే నూతన ఆలోచనే సచివాలయాలు, గ్రామ వాలంటీర్ల వ్యవస్థ అని అన్నారు. పరిపాలన, సంక్షేమం, విద్య, వైద్య, వ్యవసాయ రంగాలను పరిపుష్టి చేసి పేదలందరికీ అండగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు.

సిసి రోడ్డు ప్రారంభం

అనంతరం మండలంలోని శిలగాం పంచాయతీ పరిధిలో గల గొయ్యిగూడ గ్రామం నుంచి జోడుమానుగూడ గ్రామం వరకు రూ.50 లక్షల నిధులతో నిర్మించిన సిసి రహదారిని ఎమ్మెల్యే కళావతి ప్రారంభించారు. ఈ రహదారులు గిరిజనులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వజ్జాయి పంచాయితీలో సవర జజ్జువ గ్రామం నుండి గెడ్డగూడ గ్రామం వరకు గల రోడ్డు పనులకు రూ.1.30 కోట్లతో చేపట్టనున్న పలుపనులను ప్రారంభించి, పలుపనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించి వారి సమస్యలు పరిష్కరించడమే తమ ప్రధాన కర్తవ్యమని అన్నారు. రహదారుల విస్తరణ, అంతర్గత రోడ్ల అభివృద్ధి, ఇంటింటికీ తాగునీటి సరఫరా, చెరువుల సుందరీకరణ, కాల్వల నిర్మాణం వంటి అనేక పనులను చేపట్టామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు లక్ష్మి, ప్రతినిధి సవర రాము, వైస్ ఎంపిపిలు, జెసిఎస్ కో - ఆర్డినేటర్, స్థానిక సర్పంచ్ సవర కూర్మారావు, స్థానిక ఎంపిటిసి సవర భవాని, మండల ఎంపిటిసిలు - సర్పంచ్, గ్రామ సచివాలయ కన్వీనర్లు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ సిబ్బంది మరియు స్థానిక గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శిలగాంలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

జనం గుండె చప్పుడు శంకరరెడ్డి

ప్రజాశక్తి-పాలకొండ

జన చేతన వ్యవస్థాపకుడు, ఆదివాసీల ఆరాధ్యుడు కీర్తిశేషులు మజ్జి శంకరరెడ్డి ఆశయ సాధన లక్ష్యంగా జనచేతన స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందని సంస్థ కార్యదర్శి బగాది శశి భూషణ చౌదరి అన్నారు. శంకర రెడ్డి 17వ వర్థంతి సందర్భంగా గురువారం సీతంపేట మండలం గొయిదిలో సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమంలో ముందుగా శంకరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చౌదరి మాట్లాడుతూ శంకర రెడ్డి సవర తెగ మాతృ భాషలో విద్యా బోధన ద్వారా గ్రామ స్థాయిలో సవర భాషా పాఠశాలలు నెలకొల్పి ఆ భాషలో బోధనకు కృషి చేశారన్నారు. ఆదివాసీల అక్షరాస్యత శాతం పెంచి వారికి ఆరాధ్యుడయ్యారని పేర్కొన్నారు. ఆదివాసీల్లో ఉన్న భయం పోగొట్టి, ధైర్యాన్ని ప్రశ్నించేతత్వం అలవాటు చేశారని అన్నారు. సంతల్లో ధర్మ కాటాలు ఏర్పాటు చేసి వారికి జరుగుతున్న దోపిడీ, అన్యాయంపై చైతన్యపర్చి విముక్తి కల్పించారని, ఆదివాసీల అటవీ హక్కులు, చట్టాలు, మహిళా చట్టాలు, బాలల హక్కులు, విద్య కోసం నిరంతరం శ్రమించారని కొనియాడారు. స్థానిక సర్పంచ్ మండంగి రమణమ్మ మాట్లాడుతూ మా ఆదివాసీలకు మాట్లాడటంతో పాటు మాలో రాజకీయ చైతన్యం కల్పించారని పేర్కొన్నారు. మహిళా సంఘాల ఏర్పాటు, పొదుపు చేసే అలవాటు చేసి మా ఆర్థికాభివృద్ధికి దోహదపడ్డారన్నారు. అనంతరం పాఠశాల పిల్లలకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కట్లు పంచడంతో పాటు వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షు బిడ్డిక సరోజనమ్మ, జన చేతన సిబ్బంది ఎల్.కృష్ణారావు, ఎల్.శేషుకుమార్‌తో పాటు గ్రామస్థులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని జిల్లేడుపాడు మండల ప్రాథమిక పాఠశాల బాలబాలికలకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కట్లు పంచి పెట్టడం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, పాఠశాల పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు - రాయగడ రైలును వెంటనే పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కొమరాడ

గుంటూరు నుండి రాయగడ వచ్చే ట్రైన్‌ను వెంటనే పునరుద్ధరించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా గుంటూరు నుంచి రాయగడ వచ్చే రైలు నిలిపివేయడంతో అటు విద్యార్థులు, ఇటు వలస కూలీలు, చిన్న చిన్న వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్కువ చార్జీలతో వలస కూలీలు, విద్యార్థులు, చిరు వ్యాపారులు గాని విజయనగరం, విశాఖ, రాజమండ్రి తదితర సుదూర నగరానికి ఉపాధి కోసం వెళ్లే పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి సందర్భంలో రెండు నెలలుగా రైలును నిలిపివేయడంతో ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ప్రజాప్రతినిధులు స్పందించి గుంటూరు నుంచి రాయగడ ట్రైన్ వెంటనే పునరుద్ధరించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం నాయకులు హెచ్.రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్.శివున్నాయుడు, ఐద్వా నాయకులు ఎం.మాణిక్యం, గిరిజన సంఘం నాయకులు మధు కైలాస్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎంఒ జగన్మోహనరావు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి : డిఎంఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

ఆరోగ్య కార్యక్రమాలను పక్కగా నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. బిటివాడ, వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గురువారం నిర్వహించిన ఆశా డేలో ఆయన పాల్గొని పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్త హీనత గుర్తించిన వారిని హిమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందే వరకు పర్యవేక్షించాలన్నారు. అలాగే ఐదేళ్లలోపు పిల్లల్లో పోషకాహారం, ఎదుగుదల లోపం గుర్తిస్తే వాటిని అధిగమించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. బాలికల ఆరోగ్యం, పౌష్టికాహారం, సరైన వివాహ వయస్సుపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గర్భిణీలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా టిఫ్ఫా స్కాన్ అందుబాటులో ఉందని, తద్వారా గర్భస్థ పిండ ఎదుగుదల స్థితి తెలుసుకోవచ్చని అన్నారు. డ్రైడే కార్యక్రమాలు శాఖల సమన్వయంతో నిర్వహించి ప్రజలు పాటించేలా చైతన్యం కల్పించాలని అన్నారు. జ్వర నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంచాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించి, చికిత్స అందజేయడం ద్వారా వ్యాధి తీవ్రత చెందకుండా ఉంటుందని సూచించారు. అనంతరం అక్కడ ఆసుపత్రిలో వైద్య పరీక్షల కోసం వచ్చిన వారితో ఆయన మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, వైద్యాధికారులు పి.నితీషా, పి.ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, సిహెచ్ఒ లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి - జనసేన ప్రభుత్వం రావడం ఖాయం : జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం

మరో 45 రోజుల్లో టిడిపి - జనసేన ఉమ్మడి ప్రభుత్వం రావడం ఖాయమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి టి.జగదీశ్వరి అన్నారు. మండలంలోని గుజ్జువాయి పంచాయతీలో డేరింగ్ పాడు, డెప్పిగూడ, చిన్న అంటిజోల, నేరేడుమానుగూడ గిరిజన గ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలకు గూర్చి గురువారం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ అరాచకపాలనతో ప్రజలు విసిగిచెందారని, కావున రానున్న 45 రోజుల్లో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జ్ నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ సుబ్బలక్ష్మి, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, బూత్ చార్జీలు జానకి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐక్యంగా పనిచేసి అభ్యర్థిని గెలిపించుకుంటాం...

పార్వతీపురం రూరల్ : త్వరలో జరగబోతున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి నాయకులంతా ఐక్యంగా పనిచేసి అభ్యర్థిని గెలిపించుకొని చంద్రబాబుకు కానుకగా ఇస్తామని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి అన్నారు. పట్టణంలోని 24, 25, 26 వార్డుల్లో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయ్ చంద్ర ఆధ్వర్యంలో గురువారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోనూ పర్యటించి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చందక అనిల్‌కుమార్, టిడిపి నాయకులు బార్నాల సీతారాం గొట్టా రవికుమార్, పాలకొండ రాజశేఖర్, మరియదాసు, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, కోల మధుసూదనరావు, బడే గౌడ్‌నాయుడు, జనసేన, టిడిపి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పట్టణంలో టిడిపి ప్రచారం

పట్టణంలోని ఒకటో వార్డులో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయ్ చంద్ర గురువారం విస్తృతంగా పర్యటించి ప్రచారాన్ని నిర్వహించారు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటి, సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయ్‌చంద్ర మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంతో పాటు నియోజకవర్గంలో టిడిపి బలంగా ఉందని, జరగబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలుస్తామని అన్నారు. టిడిపి జనసేన ప్రకటించిన బిసి డిక్లరేషన్ వైసిపి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తుందన్నారు. బిసిలకు 50 ఏళ్లకే రూ.4వేలు పింఛన్ అన్నది వారి జీవితాల్లో పెనుమార్పులు తీసుకొస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బార్నాల సీతారాం, జి.వెంకటనాయుడు, కోల మధుసూదన్ రావు, జనసేన కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురం : ఐక్యతా నినాదాలు చేస్తున్న టిడిపి నాయకులు

గరుగుబిల్లి: మండల పరిధిలోని గ్రామంలో ఉల్లిభద్ర గ్రామంలో శంఖారావం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర బి సి సెల్ కన్వీనర్ మరడాన తవిటి నాయుడు, టీడీపీ నాయకులు మరడాన నారాయణస్వామిల ఆద్వర్య%శీ%లో క్లస్టర్ ఇన్చా ర్జిలతో కలిసి డోర్ టు డోర్ వెళ్లి తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ గురించి వివరిం చారు. ఈసందర్భంగా తవిటి నాయుడు, నారాయణస్వామి లు మాట్లాడుతూ ఉపాధి అవకా శాలు లేదా నెలకు మూడువేల రూపాయలు నిరుద్యోగ భృతి అందజే యడం, అదే విధంగా స్కూలు కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి పది హేను వేలరూపా యలు చెల్లించడం జరుగుతుం దన్నా రు. ప్రతి రైతుకు ఏటా20 వేల రూపాయలు ఆర్థిక సహా యం అందజేయడం జరుగు తుంద న్నారు. ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తది తర కార్య క్రమాల గురించి ప్రజలకు తెలియ జేయడం జరిగిందన్నా రు. ఈకార్యక్ర మంలో టీడీపి నాయకులు తదితరులు పాల్గొ న్నారు.

టిడిపితోనే ప్రజల భవిష్యత్తు : సంధ్యారాణి

పాచిపెంట : రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు తెలుగుదేశం పార్టీ గ్యారెంటీ అంటూ ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని తాడూరు, రాయి గుడ్డి వలస పంచాయతీల పరిధిలో గల సీల గదబవలస, ఎగువు కొత్తవలస, దిగువ కొత్తవలస గ్రామాల్లో గురువారం మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పర్యటించిన సంధ్యారాణికి పార్టీ నాయకులు, యువకులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, రోజు కూలి చేసుకునే మాకు బతుకు భారంగా మారిందని ఆమె వద్ద వాపోయారు. రానున్న రోజుల్లో తెలుగుదేశం - జనసేన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిత్యవసర వస్తువుల ధరలు తగ్గుతాయని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముఖీ సూర్యనారాయణ, పంచాది బలరాం, కొత్తల పోలినాయుడు, దండి మోహనరావు, కె.సురేష్, పి.నరసింగరావు, ఇ.తిరుపతిరావు, జి.సత్యం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంటలో ప్రచారం చేస్తున్న సంధ్యారాణి

నెలాఖరులోగా నాడు-నేడు పనులు పూర్తి

ప్రజాశక్తి - వీరఘట్టం

నాడు-నేడు ద్వారా చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులు ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంఇఒలు ఎంఇఒలు డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావు ఆదేశించారు. మండలంలో గల అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు)లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాడు-నేడు పనులు, యుడిఐఎస్ఇ, మధ్యాహ్న భోజనం, ట్యాబ్‌లు, ఐఎఫ్‌పి పానెళ్లు, ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంఇఒలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సి, సిఆర్‌పి సిబ్బంది పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కుటుంబానికి ఆర్థికసాయం

స్థానిక ఎంఇఒ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన సంపత్‌కుమార్ కుటుంబానికి ఉపాధ్యాయులు, విశాఖ అధికారులు, సిబ్బంది ఆర్థికసాయం అందజేశారు. సుమారు రూ.3లక్షల 32వేలు నగదును సంపత్‌కుమార్ భార్య, తల్లిపేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావు, అన్ని సంఘాల బాధ్యులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఇఆర్‌సి, సిఆర్‌పిలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎంఇఒలు, ఉపాధ్యాయులు

డాన్స్ చేస్తున్న విద్యార్థినిలు

ఘనంగా సత్యసాయి డిగ్రీ కాలేజీ వార్షికోత్సవం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శ్రీ సత్య సాయి డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు పలికారు. విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలనే విషయాలను వివరించారు. ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు అధ్యకతన జరిగిన సభలో శ్రీ సత్యసాయి విద్యా సంస్థలు అకాడమిక్ అడ్వైజర్ బి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా నేర్చుకున్న విషయాలను బాగా జ్ఞాపకం ఉండేలా రివిజన్ చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాయాలని కష్టపడి చదివి ఒత్తిడికిలోను కాకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డి.వెంకటరమణ, కేశవరావు, కృష్ణారావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

14న మార్కెట్ ఆశీలు వేలం పాట

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ రోజువారి మార్కెట్, మున్సిపల్ పరిధిలో గల పలు ప్రాంతాల్లో రోడ్డు మార్జిన్ అశీలు వసూళ్లు చేసుకునేందుకు వేలం పాట గురువారం ఉదయం జరగాల్సి ఉన్నప్పటికీ పాటదారులు ఎవరూ వేలంపాటకు హాజరు కాకపోవడంతో ఈనెల 14న ఉదయం 11 గంటలకు జరుగుతుందని, అదే రోజు మున్సిపల్ అధీనంలో ఉన్న మున్సిపల్ వాణిజ్యభవన సముదాయంలో ఉన్న 22, 34, 36, 44, 45, నెంబర్ల షాప్‌లకు అద్దె ప్రాతిపదికన వేలంపాట ఉదయం 11.30కు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. రోజువారీ మార్కెట్ ఆశీలు వేలంపాటలో పాల్గొనేవారు రూ.5లక్షలు సాల్విన్ సర్టిఫికేట్‌తో పాటు రూ.4లక్షలు ధరావత్తు మున్సిపల్ రెవెన్యూ అధికారులకు అందజేసి వేలం పాటలో పాల్గొనాలని కమిషనర్ పొందూరు.సింహాచలం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

దశమంతపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురంలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.లలిత, ఆశా కార్యకర్తలు, 104సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్నబగ్గ పంచాయతీ జరడకాలనీలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ప్రకృతి వ్యవసాయం అంటే ఏమిటి? ఎందుకు చేయాలి, రసాయనిక మందులు, పురుగు మందులతో పండించే పంటల వల్ల నష్టాలు, వాతావరణం మార్పు వల్ల కలిగే నష్టాల కోసం రైతులకు వివరించారు. ఏక పంటల వల్ల కలిగే నష్టాలు, బహు పంటలు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కూరగాయలు పండించే విధానం, జీడీ పంటలు దిగుబడి కోసం ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో నీమస్త్రం, ద్రవజీవామృతం, మజ్జిక ఉపయోగించి దిగుబడి పెంచవచ్చు అని వివరించారు. చిరుధాన్యాలు ఉపయోగాలు, ఉపాధి పనులు కోసం వివరించారు. ఇందులో చిన్నగారపాడు, జరడ కాలనీ గ్రామాల నుంచి 42 మంది సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ పాలక నాగేశ్వరావు, ఏరియా కో ఆర్డినేటర్లు వెన్నెల, వసంత, పార్వతి, మజ్జయ్య పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని పలు గ్రామాల్లోని గల శివాలయాల్లో మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులోభాగంగా శివ్వాంలోని నాగావళి నదిఒడ్డున గల శ్రీఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం, నాగూరులోని శ్రీచంద్రశేఖర స్వామి ఆలయం,రావుపల్లి, పెద్దూరు, గరుగుబిల్లి, రావి వలస, కొత్తూరు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. బురద వెంకటాపురంలోని శివాలయంలో వీరఘ ట్టంకు చెందిన చెందిన ప్రముఖ యజ్ఞ యాగ కర్త ఎస్ వి ఎల్ ఎన్ శర్మ యాజి సంపూర్ణ పర్యవేక్షణలో శివపార్వతుల కల్యాణం నిర్వహించ నున్నారు. ఈ ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు బొత్స చక్రధర్, బొత్స జగదీష్ లు తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ ఆనందరావు

ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని స్థానిక తహశీల్దార్ ఆనందరావు అన్నారు. స్థానిక డివిఎంఎం హై స్కూల్‌లో గురువారం జరిగిన స్వీప్ ఓటరు చైతన్య కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రుల నుద్దేశించి ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఇది సామాజిక బాధ్యతని పేర్కొన్నారు. ఎంఇఒ-1 సామల సింహాచలం మాట్లాడుతూ రానున్న టెన్త్ పరీక్షల్లో ఎటువంటి ఒత్తిడికిలోను కాకుండా విద్యార్థులు పరీక్షలు రాయాలన్నారు. డివిఎంఎం హై స్కూల్ విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని, అలాగే జిల్లా రాష్ట్ర స్థాయి ర్యాంకులను సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఎంఇఒ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు..